# ఈజీ మనీ

( హాస్యనాటిక )

రచన : శ్రీ శంకరమంచి పార్ధ సారథి

## పాత్రలు

1. వెంకటేశ్వర్లు
2. భలేరావు
3. శివప్రసాద్
4. చిన్నారావు
5. రామకృష్ణ
6. మరో రామకృష్ణ
7. నాంచారమ్మ

# ఈజీ మనీ

## ( హాస్యనాటిక )

రచన : శ్రీ శంకరమంచి పార్థ సారథి

**తెర తీసే సరికి –**

అదొక ఆఫీసు, ఆఫీసరు గది, వెనుకే గుమాస్తాలు కూర్చునే గది మరొక వైపున కనిపిస్తున్నాయి.

అక్కడ ప్యూను ఆంజనేయులు బల్లలు, కుర్చీలు శుభ్రంచేసి పనిలో మునిగి వున్నాడు.... అతనా పనిలో వుండగానే ఆఫీసుకు స్టాఫు రావడం ప్రారంభించారు....

మొట్ట మొదటగా రామారావు – నెత్తిన ఎండ తగలకుండా టోపీ, వాటరు బాటిల్, ఒక సంచీ పుచ్చుకొని చెమట కారుతూ ఆదరాబాదరాగా వచ్చి, అటెండెన్సు రిజిస్టరులో సంతకం చేస్తూ.

రామారావు : అబ్బబ్బ ! ఈ ఎండలేమిటయ్యా బాబూ, కట్టుకున్న పెళ్ళాంలాగా కాల్చుకు తింటున్నాయి ( తన సీట్లో కూర్చున్నాడు ) ఏమో అనుకున్నాను కానీ టైం ప్రకారం ఠంచనుగా ఆఫీసుకురావడం చాలా కష్టం. దీని కన్నా అంతరిక్ష యాత్ర ఈజీ !

( రంగారావు లోనికి వచ్చాడు రామారావు మాట అందిపుచ్చుకుంటూ ..

రంగారావు : సరిగ్గా నా మనసులోని మాట చెప్పారు. అయినా ఫలానా టైం కే ఆఫీసుకు రావాలి. ఫలానా టైం దాకా సీట్లో కూర్చొని తగలడాలి. వగైరా రూల్సన్నీ ట్రాష్. ఆఫీసుకి రావటానికి మనం పడే ఇబ్బందులు పైవాళకేమి తెలుస్తాయి చెప్పండి ? టైమైయిపోతొందని హై స్పీడులో వస్తుంటే లారీ వెధవ స్కూటర్ని రాసుకుంటూ పోయాడు ( రాజారావు వచ్చాడు )

రాజారావు : సర్లెండి స్కూటరు పైన వచ్చే మీరు ఇలా అంటే ఆర్టీసీ బస్సులో రావాల్సిన నా పాట్లు ఎవరికి తెలుస్తాయి. బస్సులు రావు. వచ్చినా ఆగవు, ఆగినా ఎక్కలేం. ఎక్కినా దిగలేం. ఆ రష్‌ల్లో బట్టలన్నీ నలిగిపోయి అడుక్కునే వాడికీ మనకీ పెద్ద తేడా వుండదు .( జేబులో చూసుకుని కెవ్వు మన్నాడు )

రామారావు : ఏమైంది ? పర్సు గాని కొట్టేసారా ?

రాజారావు : హడావిడిగా రావడంతో కళ్ళజోడు కాస్తా మర్చిపోయి వచ్చా ! ఇప్పుడెలా ?

రంగారావు : ముందు సంతకం అయితే పొడవండి ఆఫీసు వర్కు రేపు చేసుకోవచ్చు

రామారావు : కొత్తగా రాబోతున్న ఆఫీసరు పార్వతీశం మొత్తానికి మన చేత అలవాటు లేని పనులన్నీ చేయిస్తున్నాడయ్యా....టైంకి ఏనాడైనా ఆఫీసుకి వచ్చామా ? కళ్ళజోడు మరచి పోవటాలు దాని గురించి కలత చెందటాలు ఎరుగుదుమా ?

రంగారావు : అసలు రావటాలు, పోవటాలు సరే – ఆ విషయంలో ఎలా ఉంటాడో అదేనండి, కష్టం, సుఖం బరువు, బాధ్యతలు తెలిసిన వాడేనా అని.

రాజారావు : సరే లెండి, వాకబు చేసి ఆయన గురించి చాలా సమాచారం సేకరించా...

( ఆంజనేయులు ఆఫీసరు గదిలోంచి వచ్చి, వాళ్ళందర్నీ చూసి కళ్ళు నులుముకుని మళ్ళీ చూసి – ఆశ్చర్యంగా )

ఆంజనేయులు : ఇవాళ గొప్ప వాడెవడికో మూడిందండీ లేకపోతే లంచ్ టైం వేళకి లీజరుగా వచ్చే మీరు కరెక్ట్ టైంకి రావడం.

రామారావు : ఆంజనేయులూ ! ఎత్తి పొడుపులూ, సెటైర్లూ పక్కన బెట్టు – పార్వతీశం జాయినింగ్ ఈ రోజే కదూ.

ఆంజనేయులు : అవునండి, పది నిముషాలలో రావాలి, చాలా కరక్టు మనిషంటండీ..

రాజారావు : పది గంటలకి ఆఫీసు అంటే గడియారం పది గంటలు కొడుతుంటే కృష్ణ పాండవీయంలో దుర్యోధనుడి టైపులో ఆఫీసులోకి ఎంటరవుతాట్ట.

రంగారావు : రూల్సు రూల్సని జపం చేస్తూ, రూళ్ళకర్రలా సూటిగా వెళ్ళేరకంట. అసలు రూల్సు పుస్తకనాన్ని మనీ పర్సులా జేబులో పెట్టుకు తిరుగుతాట్ట.

ఆంజనేయులు : వీడెవడండీ బాబూ ఇండియాలో వుండవలసిన వాడు కాదన్నమాట

రాజారావు : ఇంకా విను చరిత్ర చాలా వుంది. కరప్షనంటే అసలు గిట్టదట రోజూ ఆఫీసుకి వచ్చే ముందు అవినీతిని అంతం చేస్తాను అని చెయి చాపి ప్రమాణం చేసి మరీ వస్తాట్ట.

రామారావు : స్వాతంత్ర్యం వచ్చి ఏభైయేళ్ళయినా ఇంకా ఇలాంటి వాళ్ళున్నారంటే ఆశ్చర్యంగా  వుంది... ( కాకినాడ ఆఫీసులో ఒక గుమాస్థా ఎవరికో సంతోషంగా వచ్చిన స్వీట్ ప్యాకెట్ తీసుకున్నాడని ఆర్నెల్లు సస్పెండ్ చేసాట్ట

ఆంజనేయులు : ఇన్ని సంగతులు, సీన్సూ గడగడా చెబుతున్నారు ఎలా తెలుసుకున్నారు బాబూ

రంగారావు : అందరం చందాలేసుకుని  కాకినాడ ఎస్.టీ.డీ చేసి కనుక్కున్నాం, అసలు ఈయనగారి ఇంటి పేరు ఏమిటో తెల్సా పంచాగ్నులంట....అంటే ఏమిటో తెలుసా అయిదు అగ్నులు.

రామారావు : అంటే పంచ విధాల మనల్ని కాల్చుకుని తింటాడన్న మాట.

రంగారావు : అయ్య బాబోయ్ వినటానికి భయంగా, దడగా వుంది. ఈ పంచాగ్ని హోత్రుణ్ణి ఎలా గండీ భరించేది.

రాజారావు : మనం జీతం మీద కన్నా గీతం మీద బతుకుతున్న వాళ్ళం. అలవాటైన పనులన్నీ  వదులకొని, రుద్రాక్షలు తిప్పుకుంటూ, ఋషుల్లాగ బతకటం మనవల్ల అయ్యే పనేనా.

రామారావు : ఆంజనేయులూ వెళ్ళి టీ పట్రా, ఈ లోపు మనం అనుసరించాల్సిన వ్యూహం గురించి మేం ఆలోచిస్తాం. ఏం కంగారు పడకండి. దేవుడున్నాడు. తప్పక మనకి దారి చూపిస్తాడు.

ఆంజనేయులు : కాస్త గట్టిగా ఆలోచించండి బాబూ పై సంపాదన వుంది కదా అని ఈ మధ్యనే రెండో ఫ్యామిలీ సెటప్ చేసా. ఎలాగో ఏమిటో. ( ఆంజనేయులు ప్లాస్కు తీసుకుని బయటికి వెళ్ళాడు )

రాజారావు : అయినా మనమేమన్నా దారిదోపిడీ చేస్తున్నామా, బాంక్ రాబరీ చేస్తున్నామా రూల్సు ప్రకారం చేస్తే  లేటవుద్ది కాబట్టి స్పీడప్ చేస్తాం స్పెషల్ ఫీజు కట్టండి అంటున్నాం అంతేగా.

రంగారావు : అయినా ఈ దేశంలో స్కాములూ, కుంభకోణాలూ ఎవరికి కొత్తవంట, అందరికీ తెలిసిందేగా, కరప్షన్ ఈజ్ ఎ నేషనల్ ప్రోగ్రాం.

రామారావు : ఓకే. ఓకే ఇది కరప్షన్ మీద సెమినార్ కాదు, విశ్లేషించి చర్చించడానికి రాబోతున్న పంచాగ్నుల పార్వతీశాన్ని  మన పార్టీలోకి తీసుకురావడానికి ఏం చేయాలి ఆలోచించండి.

రంగారావు : ఈ హైటెక్ యుగంలో ధర్మరాజయినా ఒక్క దెబ్బతో అధర్మ రాజుని చేసే మార్గం ఒక్కటుంది, అది ఈజీ మనీ.

రామారావు : ఈజీ మనీనా అంటే

రంగారావు : మనిషికి ఏదేనా అలవాటు చేయాలంటే ముందు రుచి చూపించాలి రుచి బాగా మరిగాక సప్లై కాస్తా ఆపేస్తే – చచ్చినట్టు దారికొచ్చి కలుపుతాడు.

రామారావు : మీరు చెప్పిన దాంట్లో బలమైన రీజను, పాయింటు వున్నాయని అనిపిస్తోంది. కానీ మన బాసును ఎలా ముగ్గులోకి దింపటం. అది చెప్పండి.

రంగారావు : ఇందతా సైకాలాజికల్ ట్రీట్‌మెంట్. మనం ఏం చేయాలంటే ( వాళ్ళిద్దరి చెవుల్లో ఏదో చెప్పాడు. వాళ్ళ ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి )

రామారావు : ఆహా సూపర్బ్

రాజారావు : మెల్లిగా అంటారేమిటండీ అసలు మేధావులకు తప్ప మామూలు మనుషులకి ఇలాంటి ఆలోచనలు రావు. ఇన్నాళ్ళూ హర్షద్ మెహతా తెలుగు వాడు కాడే అని తెగబాధపడ్డా. ఆలెవల్, ఆ స్థాయి మేధావి మనకీ ఉన్నాడని తెల్సి గర్వపడుతున్నా.

రంగారావు : టైం లేదు పార్వతీశం ఆఫీసు ప్రవేశం ఏ క్షణంలో నయినా చెయ్యచ్చు అంచేత మనం వెంటనే అరేంజిమెంట్స్ చెయ్యాలి. ఈ పథకానికి పెట్టుబడిలో ఇదిగో నా వాటా.

రామారావు : ఇది నా పేరు

రాజారావు : ఇదిగో నా కంట్రిబ్యూషన్  – పదండి ( రాజారావు, రామారావులు ఆఫీసరు గదిలోకి వెళ్ళారు. ఫైళ్ళు సర్ది, కూర్చీలను సర్ది ఆనందంగా చేతులు దులుపుకున్నారు, ఆంజనేయులు  హడావిడిగా లోనికి వచ్చి )

ఆంజనేయులు : ఆఫీసరు సారు వచ్చేస్తున్నారు, ఆటో దిగారు అదిగో మెట్లు ఎక్కుతున్నారు లోపలికి వచ్చేస్తున్నారు.

రంగారావు : రానీవయ్యా ఆఫీసులో బాంబులు పెట్టాంగా  వారు రావాలి పేలాలి, మన బాధలు తీరాలి ( ఆఫీసరు పార్వతీశం ఆఫీసర్లాగా లోనికి వచ్చారు. ఆఫీసుని పరీక్షగా చూస్తూన్నారు అందరూ భక్తిగా ఆయనకు విష్ చేశారు )

ఆంజనేయులు : నమస్కారం  సార్ ఆంజనేయులు నా పేరు. ఆఫీసు ఫ్యాన్‌ని ,ఆ బ్రీఫ్ కేస్ ఇలా యివ్వండి

పార్వతీశం : ఇవ్వను నువ్వన్నది ఆఫీసు రికార్డులు మొయ్యటానికి గానీ, నా లగేజీ కోసం కాదు. అండర్ స్టాండ్, నాకు చేతులున్నాయి. మీరేనా నా స్టాఫ్ ఇంకా ఎవరన్నా రావాలా.

రామారావు : మొత్తం ముగ్గురం సార్ నాపేరు రామారావు. హెడ్ క్లర్కుని

రాజారావు : నేను బిల్సు చూస్తుంటాను పేరు రాజారావు.

పార్వతీశం : చూస్తుంటావా పని కూడా చేస్తుంటావా ( ఆ మాటకి మిగిలిన వాళ్ళంతా నవ్వారు )

పార్వతీశం : స్టాపిట్ దేనికా నవ్వులు నాకు జోకులన్నా, కామెడీ పిక్చర్లన్నా కంపరం. ఈ బాడీకి హ్యూమర్ అస్సలు పడదు అంచేత నవ్వినట్టుగానీ చూసానో...మర్యాదగా ఉండదు జాగ్రత్త. బై ది బై నాపేరు పి.పార్వతీశం. కాకినాడ నించి ట్రాన్సఫర్ మీద యిక్కడకు వచ్చా.

రామారావు : మాకు తెల్సు సార్. మీ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీ వచ్చి మూడ్రోజులయ్యింది.

పార్వతీశం : ఆర్డర్ కాపీసు ముందస్తుగా వస్తాయని నాకు తెల్సు. ప్రత్యేకంగా చెప్పనఖర్లా....ఓకే నేన్చెప్పేది వినాలి. అడిగిన దానికి క్లుప్తంగా జవాబు చెప్పాలి దట్సాల్.

రామారావు : రండి సార్ అదే మీ రూము. ఆంజనేయులూ సార్ గది క్లీన్ చేసావుగా...

ఆంజనేయులు : చిత్తం ఎప్పుడో చేసానండి.

పార్వతీశం : ఎప్పుడో చేశావా అంటే సుమారు ఎన్ని నెలల క్రితం.

ఆంజనేయిలు : అయ్యబాబోయ్ ఎప్పుడో అంటే అదికాదండి అర్ధం. వుదయం రాగానే చేసాను అని చెప్పడం అండి.

పార్వతీశం : లాంగ్వేజి, లాంగ్వేజీ విషయంలో జాగ్రత్తగా వుండాలి, అనుమానాలకి, సందేహాలకి తావులేకుండా స్పష్టంగా క్లుప్తంగా చెప్పాలి ఓ.కే.కమింగ్ టుద పాయింట్ ఛార్జీ తీసుకునే ముందు నా గురించి మీకు క్లుప్తంగా చెప్పాలి. అది నా బాధ్యత, రూల్సు ప్రకారం పనిచేయడం నాకలవాటు, నాకు ఇష్టంకూడా, కంపెనీ జీతాలు తీసుకుంటున్నాం గాబట్టి నిజాయితీగా, వళ్ళు వంచి కష్టపడి పని చెయ్యాలి. ఆఫీసుకు రావడం దగ్గర్నుంచి. ప్రతి చిన్న విషయంలో నాకు రూల్సు బుక్కే ప్రమాణ గ్రంథం, అండర్ స్టాండ్ అది మనందరికి భగవద్గీతలాంటిది.

రంగారావు : కరక్టు సార్....

పార్వతీశం : ష్ నో ఒపీనియన్స్ అడిగినప్పుడు చెబుదురుగాని, చెప్పింది వినండి. ఆఫీసు టైము వృధా చేయటాలు కాఫీ, టీలకి షికార్లూ కుదరవు. టైంకి రావాలి, బయటికి వెళ్తే పర్మిషన్ తీసుకోవాలి. వెళ్ళేటప్పుడు చెప్పి మరీ వెళ్ళాలి.

రామారావు : ఈవెనింగ్సు బస్సులు.

పార్వతీశం : బస్సులు, గిస్సులు, బాధలు, భాష్యాలు, నేను వినను, నాకు కావలిసింది డిసిప్లెన్, సిన్సియారిటీ, హానెస్టీ, ముఖ్యంగా లంచాలు పుచ్చుకోవడాలూ. మొదలైన అవినీతి కార్యక్రమాలు అస్సలు పనికి రావు. గుర్తుంచుకోండి తర్వాత కాళ్ళా వేళ్ళా పడి బతిమాలుకుని, నా భార్య ముఖం చూడండి. నా పిల్లల ముఖం చూడండి అంటే చచ్చినా చూడను. తగ్గను అన్యాయం అయిపోగలరు జాగ్రత్త.

ఆంజినేయిలు కదా నీ పేరు.

ఆంజినేయిలు : అవున్సార్.

పార్వతీశం : నువ్వు నాతో రా, మీరు మీ పన్లు చూసుకోండి.

పార్వతీశం గదిలోకి వెళ్ళాడు. ఆంజనేయిలు ఫాలో అయ్యాడు మిగిలిన ముగ్గురూ ఆసక్తిగా గదివైపు చూస్తున్నారు, పార్వతీశం టేబుల్ని పరిశీలించి వేలు పెట్టి గీశాడు

పార్వతీశం : ఆంజనేయిలూ

ఆంజనేయిలు : యస్సార్

పార్వతీశం : ఏంటిది

ఆంజనేయిలు : తమరి వేలు సార్

పార్వతీశం : అది తెల్సు. ఆ వేలు పైన ఇదేమిటి

ఆంజనేయిలు : దుమ్ములా వుంది సార్.

పార్వతీశం : డౌటేం అక్కర్లా అది దుమ్మే అంటే నువ్వు నీ డ్యూటీ సక్రమంగా చేయడం లేదని అర్థమౌతోంది. ఈ టేబుల్ని మనసు పెట్టి తుడిచావా అని అడుగుతున్నా నిజం చెప్పు.

ఆంజినేయిలు : మనసు పెట్టి తుడవలేద్సార్ గుడ్డపెట్టి తుడిచా

పార్వతీశం : షటప్ నో జోక్స్ రేపట్నుంచి దుమ్ము కనిపించిందో దుమ్ము దులిపేస్తా

ఆంజనేయిలు : వద్దు సార్ నేనే దుమ్ము దులుపుతా మీరు దులిపితే చూట్టానికి ఛండాలంగా వుంటుంది.

పార్వతీశం : ష్ దుమ్ము దులిపేది నీకు – బల్లలకీ కుర్చీలకి కాదు ( అని కుర్చీలో కూర్చోబోయి బాంబు పెట్టినట్టుగా కెవ్వున అరిచాడు, అక్కడ గమనిస్తున్న ముగ్గురూ చేతులు కలుపుకున్నారు )

రామారావు : మొదటి బాంబు పేలింది ( ముగ్గురూ ఆఫీసరు గదిలోకి పరుగెత్తారు )

రాజారావు : ఏమైంది సార్ ఎనీ ప్రాబ్లమ్

పార్వతీశం : ఎనీ ప్రాబ్లం కాదు. మనీ ప్రాబ్లం. వాట్ ఈజ్ దిస్ ఇది ఏమిటి అని అడుగుతున్నా ( వంద కాయితం తీసి చూపించి అడుగుతున్నాడు )

రామారావు : వందనోటుగా వుంది సార్.

రంగారావు : వందనోటే పైగా కొత్తది...ఎవరది సార్

పార్వతీశం : అదే అడుగుతున్నా ఈ నోటు ఎవరిదీ ఇక్కడికి ఎలా వచ్చింది మాట్లాడరేం మిమ్మల్నే

ఆంజనేయిలు : నాకేం తెలిద్సార్ ఇందాక మీ రూమ్ క్లీన్ చేసినప్పుడు అక్కడ ఆ నోటు లేద్సార్.

రామారావు : ఆశ్చర్యంగా వుంది... నాదయితే కాదు... రంగారావుకి పై జేబిలో డబ్బు పెట్టుకొనే అలవాటు పొరపాటున జారిపడి.....

రంగారావు : సర్లేండి వంద నోటు చూసి వారమయింది నాకేం తెలీదు నాది కాదు

రాజారావు : అయినా మేం జీతాల మీద ఆధారపడి బతుకుతున్న వాళ్ళం. విచ్చల విడిగా అలా విసిరి పారేసుకునేటంత గొప్పవాళ్ళం కాము

పార్వతీశం : అర్ధమయింది నేనే ఈ నోటును ఇక్కడ పెట్టి మీ నిజాయితీని పరీక్షిస్తున్నానేమో అని మీరు భయపడుతున్నారు కదూ నో అదేం కాదు నిజం చెప్పండి నేనేమనుకోను

రామారావు : మాకేం తెలీద్సార్ ఆడబ్బు మాదెవరిదీ కాదు

రాజారావు : అక్కడికి ఎలా వచ్చిందో తెలీదు

రంగారావు : మా నిజాయితీని మీరు గుర్తించాలి మేం కూడా మీ లాంటి వాళ్ళమే సార్ మీకర్ధమయివుంటుంది.

పార్వతీశం : ఓకే. ఓకే .అంటే ఈ వంద ఎవరది కాదు. ఇక్కడికి ఎలా వచ్చిందో తెలీదు అంతేగా

రామారావు : అదే కదసార్ మొత్తుకుంటున్నది

రాజారావు : మీరు ఆర్డర్ వేస్తే ఆడబ్బుని నాదగ్గర వుంచి, ఎవరన్నా సొమ్ము పోయిందని వస్తే....

పార్వతీశం : అంత ట్రబుల్ మీకనవసరం. ఆఫీసరుగా అది నా భాద్యత, అండర్ స్టాండ్, ఈ డబ్బు నా దగ్గర వుంచుకుంటా

రంగారావు : వుంచుకోండి, అది కరక్టు పద్దతికూడానూ, వేలా లక్షలా, ఆఫ్ట్రాల్ వందేగా

పార్వతీశం : వుంచుకుంటానంటే నా సొంతం చేసుకుంటానని కాదు అర్థం. ఎంక్వైరీ చేయించి పోగొట్టుకున్న వారికి అందచేస్తానని భావం.

బై ది బై ఛార్జ్ తీసుకుంటున్న సందర్భంగా మనం అందరం కలిసి టీ తాగుదాం, ఆంజినేయిలూ ఆఫీసులో ఫ్లాస్కుందా

ఆంజినేయిలు : ఫ్లాస్కులో టీ కూడా ఉందండి, ఇప్పుడే తెచ్చాను ఇమ్మంటారా.

పార్వతీశం : టీ నేను తెప్పించాలి మీరు తాగాలి, మీరు తెప్పించిన టీ నేను తాగితే అవినీతి కిందకి వస్తుంది, ఆ ఫ్లాస్కులో టీ పారపోసి ఈ డబ్బుతో వేరే టీ పట్రా,

( ఆంజనేయిలు డబ్బులు తీసుకుని వెనక్కి తిరగ్గా, అతని వెనక వంద కాయితం జెండాలా ఎగురుతూ కన్పించింది. అది చూసి పార్వతీశం అరిచాడు )

పార్వతీశం : ఆగు అలాగే నిలబడు కదలక ఇంకో వంద

ఆంజనేయిలు : ఏంటి సార్ ఇంకో వందేమిటి ఎక్కడ సార్.

రామారావు : మైగాడ్ ఆంజినేయిలూ నీ వెనకాల షర్టుకి వంద కాయితం రెప రెప కొట్టుకుంటోందయ్యా

ఆంజినేయిలు : నిజమా

రాజారావు : పాపం ఆంజినేయిలు పిల్లలు గలవాడు కదసార్ వెనకేసుకుని వుంటాడు

ఆంజినేయిలు : ఇదుగో నాకేం తెలువదు చెపుతున్నా.

పార్వతీశం : ఆశ్చర్యంగా వుంది. కుర్చీలో వంద, ఫ్యాన్ వెనక వంద వెరీ వెరీ పెక్యూలియర్

రంగారావు : సార్ కుర్చీలో దొరికితే ఆఫీసు డబ్బు, మరి ఆంజినేయిలు షర్టుకి వుంది కదూ రూలు పొజీషను ఎలా వుందంటారు.

పార్వతీశం : ఆంజనేయిలు కంపెనీ వుద్యోగి కాబట్టి అతని వంటి పైన ఏం దొరికినా కంపెనీ ఆస్థికిందే లెక్క రూల్స్ ఆర్ వెరీ క్లియర్ కాని అతనికి తెలియకుండా షర్టు వెనకాల వందనోటు ఎలా మొలిచింది అన్నదే పాయింట్.

ఆంజినేయిలు : సార్ మీరూ ఆగండి వామ్మో వామ్మో నా వెనకాల వంద మీ వెనకాల
అయిదొందలు సార్ అయిదొందలు
పార్వతీశం : వాట్ నా వెనకాల అయిదొందలు నోటుందా నిజంగానా
రామారావు : ఎస్సార్ దేరీజ్ సం కరెన్సీ బిహైండ్ యు
రంగారావు : అయిదు వందలు ఫైవ్ హండ్రెడ్స్
రాజారావు : ఆఫీసరు గారికి ఆ మాత్రం లేకపోతే అసహ్యంగా వుంటుంది.
ఆంజినేయిలు : అర్థమైంది సార్ మీరు మమ్మల్ని పరీక్షిస్తున్నారు.
పార్వతీశం : పరీక్ష కాదోయ్ మీరు కూడా మీ మీ వెనకాల చూసుకోండి, ఆఫీసంతా
వెతకండి దొరికిన డబ్బంతా తెచ్చి నాకివ్వండి.
ఆంజినేయిలు : అలాగే సార్, పదండి సార్లూ, ప్రతి వారికీ పదిసార్లు చెప్పాలా, ఊ వెదకండి
( అందరూ వెతుకుతున్నారు. దొరికిన డబ్బులు తీసుకెళ్ళి పార్వతీశానికిస్తున్నారు, పార్వతీశం ముందు నోట్ల కట్ట పెరిగిపోతోంది. చాలా సిన్సియర్‌గా ఆ డబ్బుని లెక్క పెట్టుకుంటున్నాడు )
( అక్కడున్న నలుగురూ రెండు జట్లుగా విడిపోయి చెరోవైపూ నిల్చుని బుర్రకధ చెప్తున్న వాళ్ళలాగా పాడుతున్నారు )
రామారావు : ఆ విధమ్ముగా.....
రాజారావు : ఆ విధమ్ముగా...
రామారావు : పంచాగ్నుల పార్వతీశం అనే నిప్పులాంటి మనిషి...
రామారావు : ప్రతి దినం ఆఫీసుకు రాగానే అన్ని చోట్లా, నలుమూలలా వెతికి దొరికిన
డబ్బుని జేబులో దాచుకోవడం అనే కార్యక్రమానికి అలవాటు పడిన వాడయ్యాడు
( ఇది జరుగుతున్నంత సేపూ పార్వతీశం ఆఫీసు నలుమూలలా వెతికి దొరికిన డబ్బుని మైమ్‌లో లెక్కించే కార్యక్రమం జరుగుతూ వుంటుంది )
రంగారావు : ఏం చేశాడు...
రామారావు : ఆఫీసు చిన్నదయినందుకు మిక్కిలి బాధపడి, లంకంత ఆఫీసయితే ఇంకెంత
అయివేజు వచ్చి వుండునో కదాని తెగ బాధపడినవాడయ్యా.
రాజారావు : ఏం చేసాడు....
రామారావు : ఏమీ చేయలేక సినిమా పాటని పల్లవులు మార్చి ఈ విధంగా
పాడుకుంటున్నాడు

ఎందుకయ్యా వుంచినావు చిన్న ఆఫీసులో
డబ్బులు దొరికే యోగం పెట్టి, ఈజీ మనీ భోగం పెట్టి
ఎందుకయ్యా వుంచినావు, చిన్ని ఆఫీసులో
ఏజీ అంత ఆఫీసిచ్చి, సచివాలయమంత సిరిని ఇస్తే
సంచులతో సూటు కేసులతో సంపాయించుకోనా
ఎందుకయ్యా వుంచినావు చిన్ని ఆఫీసులో
తదిగిణతోం, తదిగిణతోం, తదిగిణతోం

రంగారావు : ఆ విధమ్ముగా బాధపడుతూ, ఎంత చెట్టుకి అంతగాలి అని మనసుతో సమాధానం చెప్పుకుని ఏడ్చే చోటు వెతుక్కోవాలని గ్రహించి రూల్సు, రెగ్యులేషన్సు పక్కకి పెట్టి.

ఆంజినేయిలు : పక్కన పెట్టి

రామారావు : దొరికిన ఈజీ మనీని సొంతం చేసుకుంటూ వుండగా

రాజారావు : ఊ వుండగా ఏం జరిగింది.

రామారావు : ఏం జరగలేదు కొంతకాలం గడిచింది. పార్వతీశానికి డబ్బు పిచ్చి పట్టుకుంది. ఈజీగా వచ్చి పడుతున్న ధనలక్ష్మి పైన మమకారం  పెరిగిపోయింది. తప్పుకి ఒప్పుకి తేడా తెలీని స్థితికి చేరుకున్నాడు...నిప్పులాంటి నిజాయితీ నీళ్ళు కారిపోయింది. అది గమనించిన శత్రువర్గం వారు

రంగారావు : ఏం చేశారు

రామారావు : డబ్బులు వెదజల్లడం ఆపేశారు. అంటే పార్వతీశానికి ఆఫీసులో డబ్బులు దొరకడం ఆగిపోయింది.

రాజారావు : ధనలక్ష్మి సాక్షాత్కారం ఆగిపోయింది...అంతేగా

రామారావు : అంతే.... అంతే, అవినీతి గుంటలో దబ్బున పడిపోయిన వ్యక్తి, శరీరం అలవకుండా ధనార్జనకి అలవాటు పడ్డవాడు, ఆ డబ్బు రాబడి ఆగిపోతే ఎలా వుంటాడు, ఏవంటాడూ, ఏం చేస్తాడో వెళ్ళి చూద్దామా...

రంగారావు : చూద్దాం, చూద్దాం పదండి

( పార్వతీశం ఆఫీసుకి వచ్చాడు స్టాఫు వాళ్ళ పనుల్లో వాళ్ళున్నారు, పార్వతీశం తన గదిలోకి వెళ్ళాడు, ఏదో పోయిన వస్తువు గురించి వెతుక్కుంటున్నట్లుగా బల్లల కింద, కూర్చీల్లో, ఫైళ్ళలో ఆదుర్దుగా వెతుకుతున్నాడు....చిరాగ్గా వున్నాడు )

రామారావు : గుడ్ మార్నింగ్ సార్....

పార్వతీశం : ఆ గుడ్ మార్నింగ్ ..... ఛీ, ఛీ, తు ధూ

రంగారావు : ఏంటి సార్...వెతుక్కుంటున్నారు.... ఏం పోయింది

పార్వతీశం : అదృష్టం పోయిందయ్యా..... ఏం వెతికి పెడతావా...
మనశ్శాంతి మాయమయింది. తెచ్చిస్తావా....దేనికయ్యా చచ్చు ప్రశ్నలు... ఛీ ఛీ డర్టీ ఆఫీసు. హు ఒక్కటి కూడా లేదు

( ఆ మాటకి నలుగురూ నాలుగు వైపులా వెతకటం మొదలుపెట్టారు )

పార్వతీశం : ఏం పోలేదని చెప్పి చచ్చానా... మీరెళ్ళి మీ మీ పన్లు చూసుకు తగలడండి. ఛీ ఛీ ఒక్కటి కనీసం ముచ్చటకి ఒక్కటి...

రామారావు : పాపం...సార్ చాలా వర్రీలో వున్నట్లున్నారు.

రాజారావు : నిప్పుకి కూడా చెదలు పడతాయని సార్‌ని చూస్తే తెలుస్తుంది.

ఆంజినేయిలు : ఆంజనేయిలు ...అని పులి, పులిలా గాండ్రించే వారు

పార్వతీశం : ఆంజినేయిలూ

ఆంజినేయిలు : సార్

పార్వతీశాం : సారా నీ పిండాకూడా  ఎందుకు ఫ్యాన్ వేశావు నా అధృష్టం ఎగిరిపోవాలనా

ఆంజనేయిలూ : అదేంటి సార్ – వుక్క పెడుతొందని ...నేనే....

పార్వతీశం : అంటే నీకు నువ్వే నిర్ణయాలు తీసుకునే స్ధాయికి వచ్చి చచ్చావా ... చాట మెహం నువ్వూనూ...పొద్దున్నే ముందుగా వచ్చి డబ్బు మొత్తం నువ్వు ఏరుకుంటున్నావేమోనని నా అనుమానం

ఆంజినేయిలూ : ఏంటి సార్ మీరనేది

పార్వతీశం : పొండి పొండి ....దరిద్రగొట్టు ఆఫీసు....డర్టీ మొహాలు అందర్నీ నరుకుతా పొండి

రామారావు : సార్ హెడ్ క్వార్టర్స్‌కి రిపోర్టు పంపాలి. ఆ ఫైలు పైన మీరు సంతకం చేస్తే

పార్వతీశం : చెయ్యను ...ఛస్తే చెయ్యను ...అసలు ఫైళ్ళు మొత్తం తూకానికి అమ్ముకుంటా. కుర్చీలు, బల్లలు – ఎవరికన్నా కావాలేమో అడగండి సొమ్ము చేసుకుంటా. ఫోండి నే వెతుక్కోవాలి మిమ్మల్నే

పార్వతీశం : ఆంజనేయిలూ

ఆంజనేయిలు : ఏం సార్ మీ వెనకాల ఏవన్నా వుందేమో చూడమంటారా

పార్వతీశం : టాయిలెట్ అద్దంలో ఆ(లెడి చూసుకున్నా(నా ..ఏం లేదు...రేయ్
...ఆంజినేయిలూ, నీకు  దణ్ణం పెడతా ఆఫీసంతా వెతికి కనీసం ఒక్క పది
నోటయినా దొరికిందని  తెచ్చి యివ్వరా లేకపోతే నాకు పిచ్చెక్కేట్టుంది.
(ఆఫీసు స్టాఫు ఇప్పుడు ఒక వలయంగా ఏర్పడి, చుట్టూ తిరుగుతూ పాడుతున్నారు)
తప్పుచేసి పప్పు కూడు తినరా ఓ నరుడా
గొప్ప నీతి వాక్యమిది వినరా పామరుడా
దొంగతనం చెయ్యరా దోపిడీలు చెయ్యరా
అందినంత మూటకట్టి మీసం మెలితిప్పరా
ఎరువుంది. కరువుంది ఎమ్ సెట్టూ పేపరుంది
గడ్డి వుంది, గాదరుంది, షేర్లు వ్యాపారముంది
దొరికిపోతే యాంటిసిపేటరీ బెయిలుంది.
అరెస్టయితే నేషనల్ లెవల్లో టీవీ కవరేజీ వుంది
తప్పు చేసి పప్పు కూడు తినరా ఓ నరుడా
గొప్ప నీతి వాక్యమిది వినరా పామరుడా

రాజారావు : ఇదిగో ఇదేం బాగాలేదయ్యా, మీరు పార్వతీశాన్ని  వదిలేసి, ఇలా ఎత్తి పొడుపు పాటలు వాడటం ఏం బాగాలేదు

రంగారావు : ఇంతకి పార్వతీశం ఏవైయ్యాడు

ఆంజనేయిలు : ఎలా వృద్ధి పొందాడు

రామారావు : ఎలా తయారయ్యాడు

రాజారావు : ఎలా సంపాయిస్తున్నాడో వినాలని కుతూహలంగా వుంది

రాజారావు : వుంటుంది, అది సహజం, నిప్పులాంటి వాడు ఈజీ సంపాదనకి అలవాటు పడి ఆ సంపాదన  రుచి మరిగి, వున్న దానితో తృప్తి చెందక  ఎలా రెచ్చి పోతాడో చూడాలని ఉందా

రంగారావు : అవును

రామారావు : పార్వతీశం కొత్త ఫిలాసఫీని ఆవిష్కరించాడు .సంపాదనతో తన మన అనే మమకారాలకి  తావివ్వరాదని, ఏ పనులైనా (ఫ్రీగా చెయ్యనని మొండికెత్తి కూర్చుంటున్నాడు.

# పార్వతీశం ఇల్లు

**పార్వతీశం ఒంటరిగా ఆ గదిలో ఏదో పోగొట్టుకున్న వస్తువు గురించి వెతకుతున్న వాడిలా నలు మూలలా పరిశీలనగా వెతకుతున్నాడు. అతని భార్య సుశీల అక్కడికి వచ్చింది భర్త తంతుకి బాగా అలవాటు పడటం చేత కాబోలు ఆశ్చర్యానికి బదులు చిరాకు, కోపం ప్రదర్శిస్తోంది.**

సుశీల : మళ్ళీ మొదలైంది దిక్కు మాలిన వెతకులాట మీరిలా తయారవుతారని కల్లో కూడా అనుకోలేదు. నా మొగుడు సత్య హరిశ్చంద్రుడు, నిప్పులాంటి మనిషి అని గర్వంగా చెప్పుకునే దాన్ని... మిమ్మల్నే

పార్వతీశం : కాస్త పక్కకి తప్పుకుని చెప్పదల్చుకున్నదేమిటో చెప్పు.

సుశీల : ఏవండి కాస్త నామాట వినండి, ఎప్పుడో ఆఫీసులో కొన్ని రోజులు డబ్బులు దొరికాయని మీరిలా ప్రతి చోటా వెతకడం మంచిది కాదు. నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు. నిన్న మీరు వీధిలో ఆ చెత్త కుండీ దగ్గర వెతుకుతుంటే పక్కింటావిడ చూసిందట – ఏం పోయిందీ మీవారలా వెతుక్కుంటున్నారు పాపం అని అడిగింది.

పార్వతీశం : మనిషి జన్మనే పెద్ద వెతుకులాటని చెప్పాల్సింది. బుద్ధుడూ, శంకరాచార్యులు వారూ అందరూ అలా వెతుక్కున్న వాళ్ళే. కాకపోతే వాళ్ళు జీవితానికి అర్థం వెతుకుతున్నారు. నేను ఈ అర్థం గురించి వెతుకుతున్నా.

సుశీల : అంటే వాళ్ళూ మీరు ఒకటేనా వెతికింది చాలుగానీ వెళ్ళి స్నానం చేసిరండి నీళ్ళు చల్లారిపోతున్నాయి.

పార్వతీశం : అయిదు రూపాయిలవుతుంది.

సుశీల : ఏమిటీ స్నానం చెయ్యాలంటే నేను అయిదు రూపాయిలివ్వాలా, భోజనానికి రండీ అంటే పది, టిఫిన్‌కి అయిదూ, కాఫీకి మూడ్రూపాయలు అడిగారు.

పార్వతీశం : గుర్తుంది, రేట్లు ఫిక్స్‌డ్,... పండగలకి  తగ్గింపు ధరలుంటాయి. సరేకానీ ఇంతకీ ఆ సంగతి ఏం చేశావ్.

సుశీల : ఏ సంగతి గురించి

పార్వతీశం : ఆహా ఆహాహా ఏమీ తెలియనట్లు, గుర్తులేనట్లు ఆ నటన చూడు.అదేనే మీ నాన్న నాకివ్వాల్సిన కట్నం గురించి. పాతికేళ్ళ క్రితం నిన్ను కట్నం తీసుకోకుండా కట్టుకున్నా కదా.

సుశీల : మళ్ళీ మొదలెట్టారూ, పెళ్ళైన పాతికేళ్ళకి కట్నం కావాలని అడిగితే డబ్బు లివ్వరు గానీ, మీకు పిచ్చిపట్టిందని ప్రచారం చేసి నవ్వుకుంటారు.

పార్వతీశం : నవ్వుకోనీ నాకే నామోషీ లేదు. నాకు డబ్బులు కావాలి. ఆదర్శం అని ఆ రోజుల్లో నిన్ను ఫ్రీగా కట్టుకున్నా, ఇప్పుడు నాకు కావాల్సింది ఆదర్శం కాదు ఆదాయం. వెళ్ళు. వెళ్ళి మీ బాబునడిగి లక్షరూపాయిలు పట్టుకునిరా. లేకపోతే నువ్వు నా భార్యవీ కాదు, నేను నీ మొగుడ్నీ కాను, విడాకులిచ్చి పారేసి వేరే పెళ్ళి చేసుకుంటా.

సుశీల : ఏవండి – మిమ్మల్ని నెత్తి మీద ఒక్క మొట్టు మొట్టాలంటే ఎంతిచ్చుకోవాలి

పార్వతీశం : వెరీ గుడ్ అలా అడిగి తెలుసుకోవాలి ఇవాళ ఆదివారం కాబట్టి ఒక ఇరవై యిచ్చుకో. అదే వర్కింగ్ డేసైతే ముప్పయి ( సుశీల కొంగులోంచి డబ్బులు తీసింది పక్కనున్న ఫ్లవర్‌వాజు తీసుకుని డబ్బులు మొగుడికిచ్చి , సూత్రాలు కళ్ళకద్దుకుని

సుశీల : ఏవండీ ఎవరన్నా చూస్తే బాగుండదు, ఆ గదిలోకి పదండి.

పార్వతీశం : అలాగే ఎక్కడైతే నాక్కావలసింది డబ్బు

సుశీల : సరే కాస్త ఇటు తిరగండి ( ఫ్లవర్ వాజ్‌తో నెత్తిన కొట్టింది. పార్వతీశం పెద్దగా అరిచి కిందపడ్డాడు ) దెబ్బకి దెయ్యం పారిపోతుంది అంటారు. ఇలా చేస్తేనన్నా మీరు మామూలు మనిషి అవుతారేమోనని అని ఆశ. ఏం అనుకోకండి ) అసలు మీరు ఇలా తయారవటానికి ఆఫీసులో ఆ నలుగురే కారణం ముందు మీ సంగతి తేల్చి తర్వాత వాళ్ళ సంగతి తేల్చి పారేస్తా.

## పార్వతీశం ఇల్లు

పార్వతీశం తలకి కట్టు కట్టుకుని వచ్చాడు. నెత్తిని తడిమి చూసుకున్నాడు. సుశీలా, సుశీలా అని పిలిచాడు. జవాబు లేదు. అంతలో రామారావు రాజారావులు లోపలినుంచి మెల్లిగా మాట్లాడుకుంటూ రావడం కనిపించింది. పార్వతీశం పలకరించాడు.

పార్వతీశం : ఏమిటయ్యా మాయింటికొచ్చారు ఎంత సేపైంది వచ్చి మిమ్మల్నే

( రామారావు, రాజారావు అసలు పార్వతీశం ఎవరో గుర్తించట్లుగా అనుమానంగా ముఖాలు చూసుకున్నారు )

పార్వతీశం : ఏమిటయ్యా ...ఏంటా పిచ్చి చూపులు ఏం జరిగింది,.

రామారావు : ఎవరండి మీరు

రాజారావు : మేము మీకు తెలుసా...కానీ మిమ్మల్ని చూసినట్లు మాకయితే గుర్తులేదు.

పార్వతీశం : ఎవరండి మీరు, మేము మీకు తెలుసా...ఇదిగో రామారావు ఎంతయినా మీ ఆఫీసర్ని నాతో ఆడుకోకండి, అన్యాయం అయిపోతారు మాయింటికొచ్చి నన్ను ఎవరండి మీరు అంటారా తమాషాగా వుందా.

రామారావు : చూడండి వెళ్ళే వాళ్ళని పిలిచి మరీ దేనికండి గొడవ పెట్టుకుంటారు....రాజారావెవరు అతని పేరు గుఅజాడ అప్పారావు. నా పేరు కందుకూరి వీరేశలింగం. ఇది మెంటల్ హాస్పిటలు.

రాజారావు : ఈయన కూడా పేషెంటులా ఉన్నాడు పోదాం పదా...

పార్వతీశం : ఇది మెంటల్ ఆసుపత్రా ...అంటే మీరు మీ తాలూకు పేషెంట్లని చూడ్డానికి వచ్చారా.

రామారావు : అవును మా బావగారు సడన్‌గా బట్టలిప్పుకుని బజార్ల వెంట తిరుగుతుంటే తీసుకొచ్చి ఇక్కడ చేర్పించాం, మీరూ పేషెంటా

పార్వతీశం : నాపేరు పార్వతీశం ...మీ ఆఫీసర్ని, ఇది నాల్లు మీరు మా యింటికొచ్చారు. దేనికొచ్చారు అని అడుగుతున్నా, దేనికా సకలింతలు – మిమ్మల్నే.

రామారావు : సారీ సార్.... మీరెవరో మాకు తెలీదు క్షమించండి.

రాజారావు : పదండి పోదాం మెంటల్ పేషెంట్స్‌తో మనకేంటి

( రామారావు, రాజారావులు వెళ్ళిపోయారు పార్వతీశం వాళ్ళని చూస్తుండగా సుశీల నర్సు గెటప్‌లో చిన్న ప్యాడ్ పుచ్చుకుని ప్రవేశించింది ).

పార్వతీశం : ఇదిగో రామారావ్. రాజారావ్ మిమ్మల్నే నేను ఆఫీసర్ని మీ అంతు చూస్తా

( సుశీలా వచ్చావా ఎక్కడికి చచ్చావ్, ఈ గెటప్ ఏమిటి నర్సులా నిన్నే, నీకీ మధ్య పెత్తనాలు ఎక్కువైపోయాయి. మాడు పగిలేటట్టు మొగుణ్ణి కొట్టి ఏం పట్టనట్లు కులాసాగా షికార్లు కొడుతున్నావా.

సుశీల : అరగంటలో డాక్టరుగారొస్తారు, రెస్టు తీసుకోండి ఎక్కువగా మాట్లాడితే మెదడు ఇంకా పాడయిపోతుందని డాక్టరుగారు చెప్పమన్నారు.

పార్వతీశం : మెదడు ఇంకా పాడయిపోతుందా...అంటే ఇప్పుడు నా బ్రెయిన్ నార్మల్‌గా లేదా... ( ఇంతలో రంగారావు కంగారుగా బయటి నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి సుశీలతో )

రంగారావు : సిస్టర్ సిస్టర్ త్వరగా రండి నా వైఫ్ రాణీ రుద్రమ దేవినని మంచం ఎక్కి గంతులేస్తోంది. నా గుర్రం ఎక్కడ అని గొడవ పెడుతోంది. వచ్చి ఇంజక్షనివ్వండి ప్లీజ్

పార్వతీశం : రంగారావ్ ఏమిటయ్యా ఆ కంగారు ...నీ వైఫుకి ఏమైంది నా భార్యని పట్టుకుని సిస్టర్ అంటావేమిటి నీకేమైనా పిచ్చి పట్టిందా...

రంగారావు : రంగారావా వాడెవడు అసలు మీరెవరు ఇది నీ యిల్లా సిస్టర్ నీ భార్యా

సుశీల : ప్లీజ్ అయన పేషెంట్ ఆ మాటలు పట్టించుకోకండి ...మీరెళ్ళి పక్క వార్డులో సిస్టర్ మేరీ వుంటుంది. నే చెప్పానని చెప్పి తీసుకెళ్ళండి.

రంగారావు : అలాగే సిస్టర్ ( పరిగెత్తాడు )

పార్వతీశం : సుశీలా ఏమిటి ఈ గోల నువ్వు సిస్టర్ ఏమిటి నేను పేషెంట్ .... ఏమిటి ఈ నాటకం నిన్నే

సుశీల : చూడండి మీపేరు సోమ సుందరం మీకు బీసెంట్ రోడ్డులో చెప్పుల దుకాణం వుంది... రెండ్రోజుల క్రితం డాబా పైనుంచి కింద పడ్డారు. తీసుకొచ్చి యీ ఆసుపత్రిలో ఎడ్మిట్ చేసారు గుర్తుకొస్తోందా.

పార్వతీశం : నా పేరు సోమ సుందరమా నాది చెప్పుల షాపా... సుశీలా చంపుతా పిచ్చి పిచ్చి వేషాలు వేశావంటే విడాకులిచ్చి పారేసి వేరే పెళ్ళి చేసుకుంటా.

సుశీల : సరే మీకేసు స్టడీకి డాక్టరు గారు మెటీరియల్ నోట్ చేయమన్నారు, నేను మీ భార్యలా కనిపిస్తున్నానా .....ఆవిడ పేరు సుశీలా సరే ఇది ఆసుపత్రా ఇల్లా.

పార్వతీశం : ఇది మన ఇల్లు అదిగో టీ.వీ ....ఇది టేబిలు ( అంతలో ఆంజనేయులు డాక్టర్ వేషంలో వచ్చాడు )

ఆంజనేయులు : హల్లో సిస్టర్

సుశీల : గుడ్ మార్నింగ్ డాక్టర్

పార్వతీశం : ఏరా ఆంజనేయిలూ ఏమిటీ అవతారం ...నిన్నేరా చెప్పకపోతే తొక్కి నారతీస్తా నారవెధవా

ఆంజనేయిలు : హూ ఈజ్ ఆంజనేయిలూ

సుశీల : తెలీదు డాక్టర్ నన్ను తన భార్య సుశీల అంటున్నారు. ఇది వారి ఇల్లట, ప్రతి వాళ్ళని రకరకాల పేర్లతో పలకరించి, నేను ఆఫీసర్ని మీ అంతు చూస్తానంటున్నారు.

ఆంజనేయులు : ఐ సీ పేషెంట్ తాలూకు మనుషులు ఎవరూ రాలేదా.

సుశీల : ఇతను వాళ్ళావిడకి విడాకులిస్తానంటే ఆవిడ పుట్టింటికి వెళ్ళిపోయిందట, మెసేజ్ పంపించాం

పార్వతీశం : సుశీలా...నాకర్థమైంది కట్నం డబ్బు తీసుకు రమ్మన్నానని ఇలా నాటకం ఆడుతున్నావు కదూ చూడు ఆంజనేయిలూ

ఆంజనేయిలు : బ్రెయిన్లో బ్లడ్ క్లాటవటం చేత గుర్తు పట్టే శక్తి పోయింది. కేసుని బాగా స్టడీ చేయాలి. అతనేమన్నా పట్టించుకోకండి, రోగ లక్షణం, బైదిబై టేప్ రికార్డర్ తెప్పించి అతని వాగుడంతా రికార్డు చేయించు మన స్టడీకి పనికొస్తుంది.

సుశీల : బ్యాటరీలు అయిపోయాయి తెప్పించాలి డాక్టర్.

ఆంజనేయిలు : ఓ ష్యూర్...తెప్పించండి ఖర్చుకి ఏ మాత్రం వెనకాడవద్దు. ఈ కేసు మనకి ఛాలెంజింగ్ కేసు డబ్బులు తీసుకోండి ( అని జేబులోంచి చిత్తు కాగితం తీసి ఆమెకిచ్చాడు అది పార్వతీశం చూశాడు )

పార్వతీశం : ఆహాహా ఏం నాటకంరా మీ మెహాలు మండిపోనూ చిత్తు కాయితం చేతికిచ్చి బ్యాటరీలు తెప్పించమంటావా ...రేయ్ ఆంజనేయిలూ పీక కొరుకుతా.

సుశీల : షటప్ యూ బ్లడీ

ఆంజనేయిలు : నో సిస్టర్ మనం కూడా పేషెంట్‌తో సమనంగా అరవకూడదు మనకి పెషెన్సు ఉండాలి. చూడండి ఇది మీకు చిత్తు కాయితంలా కనిపిస్తోందా.

పార్వతీశం : అవును ఏం అది వందనోటా

ఆంజనేయిలు : సిస్టర్ ప్లీజ్ నోట్ ఇట్

( ఇంతలో రామారావు, రాజారావు ఒకరి వెనకాల ఒకరు ఆదుర్దాగా వచ్చారు )

రామారావు : డాక్టర్ సోమసుందరం అని షూమార్టు ఓనరు...బావా ఎంత ఘోరం జరిగింది బావా ...తెలియగానే పరిగెట్టుకొచ్చా బావా...

పార్వతీశం : బస్సుకి డబ్బుల్లేకనా... పరుగెత్తుకొచ్చాట్ట...పరుగెత్తుకుని

రాజారావు : మావయ్యా .... నేను మావయ్యా నీ అరవిందాన్ని ఎలా వున్నావు మామయ్యా డాక్టర్ ఎలాగైనా మా మావయ్యని మామూలు మనిషిని చెయ్యండి మీకెంత డబ్బు కావాలన్నా ఇస్తా.

ఆంజనేయిలు : ఓకే ఓకే  మా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాం, మీరు మాత్రం పేషెంటుని రెచ్చ గొట్టి వాగించకండి...ఏదంటే అది ఒప్పేసుకోండి

రామరావు : అలాగే డాక్టర్ ఏం బావా ఏంటంటావ్

పార్వతీశం : రామారావ్ నిన్ను

ఆంజనేయిలు : మిమ్మల్ని రామారావ్ అంటున్నారు...ఓకే అననీయండి...

రామారావు : ఓకే బావా నేను రామారావునే ఏం కావాలి.

రాజారావు : మావయ్యా నేనెవర్ని చెప్పు మావయ్యా

పార్వతీశం : అరవిందానివి కదూ

రాజారావు : ( ఆనందంగా గంతులేస్తూ ) మావయ్య గుర్తు పట్టాడు. మావయ్య నన్ను గుర్తు పట్టాడు థాంక్యూ డాక్టర్, థాంక్యూ సోమచ్.

ఆంజనేయిలు : ష్...కంగారు పెడితే మళ్ళీ మొదటికి రావచ్చు.

పార్వతీశం :  రాజారావ్ కుప్పిగంతులాపి అలా కూర్చో అందరూ కల్సి నాటకం ఆడతారా ఎన్నాళ్ళు ఆడతారో చూస్తాగా.

ఆంజనేయిలు : చూశారా... నే చెప్పానా... గుర్తు పట్టిన మనిషి  మళ్ళీ రాజారావ్ అన్నారు అందుకే మేం విజిటర్స్‌ని రానివ్వం.

పార్వతీశం : ఆహా...ఓరి నీ పోజు తుంగలో తొక్కా ....ఆంజనేయిలు నిజం చెప్పు ఎవరు నీకి నాటకం ఆడమని చెప్పింది. చెప్పు నేనేం అనను, ఏం చెయ్యను ఒట్టు.

ఆంజనేయిలు : ఓకే...ఓకే ...నేను ఆంజనేయిల్ని కదా ఓకే...ఓకే...ఇది  మీ ఇల్లు కదా ఓకే ఓకే ...ఈ సిస్టర్  మీ  భార్య సుశీలగారని పిస్తోంది కదా ఓకే ఓకే... ( పక్కనున్న  నీళ్ళ చెంబుని చూపించి ) ఇదేవిటి

పార్వతీశం : అదేమిటా, గుడ్డి మొహం నీళ్ళ చెంబురా

ఆంజనేయిలు : ఐ.సీ. మెడికల్ బ్యాగ్ నీళ్ళ చెంబులా కనిపిస్తోంది. ఓకే ఓకే ఇదేమిటి ( తాడు చూపించాడు )

పార్వతీశం : అదేమిటో నేను చెప్పను.

రామారావు : బావా చెప్పు బావా నీ మంచి గురించే కథ బావా ఈ స్టడీ అంతా

రాజారావు : మావయ్యా నన్ను రాజారావు  అన్నట్టుగానే, అది ఎలా కనిపిస్తుందో  చెప్పు మావయ్యా  రోగం రూటు  పట్టుకోవాలని డాక్టరు గారు విశ్వ ప్రయత్నం  చేస్తున్నారు చెప్పు మావయ్యా

పార్వతీశం : రేయ్ ....అతిగా వాగావంటే ఆ తాడు మెడకు చుట్టి చంపి పారేస్తా
రామారావు : తాడు... తాడులా కనిపిస్తోందా ఇది...
ఆంజనేయిలు : స్టెతస్కోపు తాడులానిపిస్తోంది ఓకే... కాస్సేపు నన్ను ఆలోచించుకోనివ్వండి
( అని పక్కని వెళ్ళి దీర్ఘాలోచనలో పడ్డాడు )
రంగారావు : చీమక్కూడా అపకారం చెయ్యని మనిషి – భగవంతుడా దేనికీ శిక్ష
రాజారావు : ఎన్ని దానాలు చేశాడు ఎన్ని ధర్మాలు చేశాడు, ఆ పుణ్యం ఊరికేపోదు.
పార్వతీశం : ఇదెక్కడి భాగోతంరా దేవుడా సుశీలా ఆకలేస్తోందే
సుశీల : డాక్టర్ పేషెంటుకి ఆకలేస్తోందట ఏం ఇవ్వమంటారు
ఆంజనేయిలు : చెప్తా నాకర్దమైంది రోగం రూలు పట్టుకున్నా..... నాకర్ధమైంది
యూరేకా...రామరావు
రామారావు : డాక్టర్ .,....డాక్టర్ ...మిమ్మల్నే ...
ఆంజనేయిలు : మీ బావగారి వ్యాదేమిటో నాకర్దమైంది. చూడండి రుజువు చేస్తా( మనీ పర్స్ తీశాడు ) నా అంచనా ప్రకారం ఇది పేషెంటుకి మనీ పర్సులా కనబడాలి. చూడండి సోమ సుందరం గారూ నా చేతిలో వున్న వస్తువేమిటి.
పార్వతీశం : టెలిఫోను డైరెక్టరి.
ఆంజనేయిలు : సారీ ఐ యామ్ ఫెయిల్డ్ , నేను ఓడిపోయాను .... నేనోడిపోయాను
పార్వతీశం : నీ బొంద దిబ్బ వెధవా అది మనీ పర్సురా...
రామరావు : డాక్టర్ .... యు.ఆర్ ఎ సక్సెస్.... యు ఆర్ ఎ సక్సెస్...
రాజారావు : డాక్టర్ కంగ్రాట్స్ యు ఆర్ బ్రిలియంట్
సుశీల : డాక్టర్ కంగ్రాట్స్ పేషెంటుకి ఆహారం
ఆంజనేయిలు : యస్.రెండు బ్రెడ్ ముక్కల్నిచ్చి మేక పాలు పట్టి చూడండి....మీ బావగారికి ఆపరేషన్ చేయాలి డబ్బులు బాగా ఖర్చవుతాయి. మరి ఆర్ యు రెడీ
రామారావు : డబ్బు గురించి వర్రీ వద్దు డాక్టర్...ఆయన్ని మామూలు మనిషిని చేయండి చాలు బాబూ డాక్టరు గారికి డబ్బులియి.
రాజారావు : అలాగే డాడీ ( బ్రీఫ్ కేస్‌లో నుంచి చిత్తు కాగితాలు కట్ట తీసి డాక్టర్‌కి యిచ్చాడు పార్వతీశం చూసాడు
ఆంజనేయులు : ఏం సోమసుందరంగారూ ఈ కట్ట చిత్తు కాగితాల కట్టలా కనిపిస్తోందా

పార్వతీశం : నే చెప్పనయ్యా, నే చెప్పను, మీ అమ్మ కడుపులు మాడా ...ఒక్కడ్ని చేసి ఏడిపిస్తారా ,.... నాటకం ఆడతారా...రేయ్ నేనెవర్ననుకుంటున్నార్రా పంచాగ్నుల పార్వతీశాన్ని అంత తేలిగ్గావదల్ను.

( అంతలో రామారావు అక్కడిక వచ్చి )

రామారావు : ఎవడ్రా నా పేరు వాడుకుంటున్నది పంచాగ్నుల పార్వతీశాన్ని నేన్రా.

పార్వతీశం : రామారావ్ ఏం కూశావ్ నువ్వు పార్వతీశానివా చంపుతా నువ్వు రామారావువి నా సబార్డినేట్వి ఎంతలో ఉండాలో అంతలో ఉండు.

రామరావు : డాక్టర్ మీరు చెప్పండి నెల రోజుల మీ దగ్గర ట్రీట్మెంట్ తీసుకుంటున్న పేషెంట్గా అడుగుతున్నా ...నా పేరు పార్వతీశం అవునా...

ఆంజనేయిలు : ఎస్ పంచాగ్నుల పార్వతీశం అంటే మీరు....మీరు లంచాలకీ, ఈజీమనీకి అలవాటు పడి డబ్బు జబ్బుతో ఆరోగ్యం పాడు చేసుకున్నారు. నెల రోజుల క్రితం మిమ్మల్ని తీసుకొచ్చినప్పుడు మీ పేరు అక్కినేని నాగేశ్వర్రావని అన్నపూర్ణా స్టూడియోస్ మీదేనని వాదించారు. దేవుడు మీ యందున్నాడు మందులు పనిచేసి మామూలుగా మనిషయ్యారు తిరిగి పార్వతీశం అయ్యారు.

పార్వతీశం : అంతా అబద్ధం పార్వతీశం వాడు కాడు నేను ఈజీ మనీకి అలవాటు పడి ప్రతి చోటా వెతుక్కునే పార్వతీశాన్ని నేను.

( ఇంతలో సుశీల ఒక ఖాళీ ప్లేటు తెచ్చి పార్వతీశం ముందుంచి )

సుశీల : ఆ రెండు బ్రెడ్ ముక్కలూ తినండి... మేకపాలు తీసుకొస్తా...

పార్వతీశం : ఆ రెండు బ్రెడ్డు ముక్కలూ తినాలా.,... ఏ రెండు ముక్కలూ ( సుశీల కట్టుకున్న మొగుణ్ణి ఇలా కాల్చుకు తింటున్నావ్ అనుభవిస్తావ్ )

సుశీల : డాక్టర్ పేషెంటుకి పళ్ళెంలో బ్రెడ్డు ముక్కలు కనిపించటం లేదట.

రామారావు : మొదట్లో నాకూ కనిపించేవి కావు సిస్టర్. నేను అలాగే అలిగేవాణ్ణి అది రోగ లక్షణం.

పార్వతీశం : అలాగయితే తమరు ఆరగించండి పార్వతీశం గారూ

ఆంజనేయిలు : వెరీ గుడ్ ఇంప్రూవ్మెంట్..... మనుషుల్ని గుర్తిస్తున్నారు చూశారా.

రామరావు : నాకు ఒక పీసు చాలు, డాక్టర్ ప్లీజ్ నాకోసం ( మైములో ఒక ముక్క డాక్టర్కిచ్చి ఒకటి తను తీసుకుని ఇద్దరూ తింటునట్లుగా నటిస్తున్నారు )

ఆంజనేయిలు : బ్రెడ్ చాలా బావుంది.

రామరావు : వెరీ వెరీ టేస్టీ....డాక్టర్ మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను. డబ్బు పిచ్చిని తలకెక్కించుకుని వుచ్ఛ, నీచం అనేవి లేకుండా చివరికి కట్టుకున్న భార్యతో కూడా వ్యాపార ధోరణిలో పశువులా ప్రవర్తించిన నాకు – ఆరోగ్యాన్ని ప్రసాదించారు.

రంగారావు : అంటే ఇంట్లో వైఫ్ భోజనానికి రమ్మన్నా రేటు పెట్టి పీక్కుతిన్న పార్వతీశం మీరేనా

రామారవు : అవున్సార్ నేనే

పార్వతీశం : అద్దం. ఆ పార్వతీశాన్ని నేను అతను కాదు

రాజారావు : పెళ్ళైన పాతికేళ్ళ తరువాత కట్నం తీసుకురాకపోతే విడాకులిస్తానని బెదిరించినది

రామారావు : ఆ దుర్మార్గపు మొగుడ్ని – ఆ పార్వతీశాన్ని నేనే సార్....

పార్వతీశం : ఆ పార్వతీశాన్ని నేను ఆమాట అన్నది నేనే నా మాట నమ్మండి.

సుశీల : అంటే ఇలాంటి మొగుడితో కాపురం చేయడం కన్నా దేంట్లోనో దూకి చావటం నయం అని వెళ్ళి పోయిన ఈ సుశీల మొగుడు మీరా

రామారావు : అవును సిస్టర్ నాకు బుద్దొచ్చింది నాకళ్ళు తెరుచుకున్నాయి

పార్వతీశం : ఆ మాటలన్నీ నేననాలి. ఆ మొగుడ్ని నేను, కానీ నా భార్య సుశీల ఎక్కడికీ వెళ్ళలా ఇక్కడే వుంది సుశీలా నన్ను క్షమించు తప్పై పోయింది.
అందరూ వినండి అవును నేను డబ్బు మనిషినయిపోయాను పరువు ప్రతిష్టలకన్నా డబ్బే ముఖ్యం అనే జంతువునైపోయాను. రక్తం రుచి మరిగిన పులిలా ఈజీమనీ కి అలవాటు పడి పతనం అయిపోయాను. బ్రతకటానికి డబ్బు సంపాదించాలి, సంపాదించడానికే బ్రతక్కూడదు అనే చిన్న సత్యాన్ని తెల్సుకోలేక మీ అందర్నీ అవస్థ పెట్టాను క్షమించండి.

సుశీల : డాక్టర్ పేషెంటు పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు.

ఆంజనేయిలు : మాట్లాడనివ్వండి ...క్యారెక్టరు అర్ధమవుతుంది.

రంగారావు : మొదలు పెట్టిన నాటకం పూర్తి చేయక తప్పదు. సార్ నేను రంగారావునే అతను ఆంజనేయిలే.

రామరావు : నేను రామరావునే ఇతను రాజారావే

రాజారావు : మేమంతా మీ సబార్డినేట్స్‌మే సార్, మేడంగారి ద్వారా పరిస్థితి తెలుసుకున్నాం మీరిలా అయిపోవడానికి కారణం మేమే అని గుర్తించాం

రామారావు : అందుకే మిమ్మల్ని మళ్ళీ మామూలు మనిషిని చేయడానికే ఈ నాటకం అంతా ఆడాం మమ్మల్ని క్షమించండి.

సుశీల: అవునండి దీని కంతటికీ నేనే కారణం వాళ్ళనేం అనకండి. మిమ్మల్ని ఇంత బాధపెట్టినందుకు ఎంత కావాలో చెప్తే నా బంగారం అంతా అమ్మైనా ఇస్తా.

పార్వతీశం : ఒద్దు సుశీలా డబ్బు మత్తు మందు లాంటిది దాన్ని ఎవరు తాగినా మత్తు ఎక్కుతుంది. ఇదిగో వాళ్ళంతా కల్సి నాకు ఆ మత్తుని అలవాటు చేసారు. కళ్ళు మూసుకుపోయి అనాగరికంగా ప్రవర్తించా. ఇప్పుడే తెల్లవారింది మత్తు దిగిపోయింది. దాని జోలికి పోను ప్రమాణం చేస్తున్నాను.

రంగారావు : మమ్మల్ని క్షమించండి సార్ పెరిగిపోతున్న అవసరాలకి తగ్గట్టు ఆదాయం పెరగకపోవడంతో అడ్డదార్లలో సంపాయించాలని ఆశపడ్డాం.

రామారావు : మా తప్పు తెలుసొచ్చింది ఇక అక్రమంగా ఒక్క రూపాయి కూడా తీసుకోం.

రాజారావు : ఈజీ మనీకి దూరంగా వుంటాం.

ఆంజనేయిలు : కష్టపడి సంపాయించుకున్నదే ఆనందాన్నిస్తుంది, ఇంట్లో నిలుస్తుంది వంటపడుతుంది.

పార్వతీశం : మనం సామాన్యులం, తప్పు పూర్తిగా మనది కూడా కాదు. మనల్ని పాలించే రాజులు, మంత్రులే స్కాముల్లో, కుంభకోణాల్లో ఇరుక్కుంటుంటే సామాన్యులు పవిత్రంగా ఎందుకుండాలి...పై వర్గాల్లో ముందు అవినీతిని, ఈజీమనీని అరికడితే సామాన్యులు కూడా నిజాయితీగా బ్రతకడానికి ప్రయత్నిస్తారు...కమాన్...

ఈజీ మనీని దగ్గరకు రానివ్వం అని ప్రమాణం చేద్దాం రండి...

( అందరూ వలయంగా నిలబడి చేతుల చాపి ప్రమాణం చేస్తున్నారు )

హే భగవాన్ కాపాడు నా దేశాన్ని, స్కీముల నుంచి, స్కాముల నుంచి, స్వాముల నుంచి కుళ్ళు రాజకీయాల నుంచి, దేశ సంపద దోచుకుంటున్న రాబందులనుంచి కాపాడు నా దేశాన్ని, కష్టాన్నీ, కష్టార్జితానికీ గౌరవాన్ని గుర్తింపునిచ్చి, మంచితనాన్నీ, మానవత్వాన్నీ కాపాడు – భగవాన్ కాపాడు )

---- సమాప్తం -----